# శ్రీకాకుళ గిరిజన ఉద్యమ తొలి అమరులు కామ్రేడ్స్ కోరన్న మంగన్నల 56వ వర్ధంతి సభ




**శ్రీకాకుళం, పార్వతీపురం, 31-10-23:**

మహత్తర శ్రీకాకుళ గిరిజన రైతాంగ అమరులు కామ్రేడ్స్ కోరన్న మంగన్నలకు ఘనంగా నివాళి అర్పిస్తూ, అమరల స్ఫూర్తిని స్మరించుకుంటూ శ్రీకాకుళం – ఆముదాలవలస బైపాస్ రోడ్డు పక్కనున్న అమరుల స్థూపం వద్ద రైతు కూలీ సంఘం (ఆంధ్ర) ఆధ్వర్యంలో 31-10-23న సభ జరిగింది. రైతు కూలీ సంఘం(ఆంధ్ర) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర అరుణ జెండా ఆవిష్కరణ చేసి, సభకు అధ్యక్షత వహించారు.

రైతు కూలీ సంఘం (ఆంధ్ర) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఎన్.ఝాన్సీ మాట్లాడుతూ శ్రీకాకుళ పోరాటంలో 360 మంది కామ్రేడ్స్ అమరులయ్యారని, వాళ్ళ త్యాగాలకు నిదర్శనం ఈ స్థూపం అని అన్నారు. అమరులస్ఫూర్తితో పోరాటాలు నిర్మించాలని అన్నారు. అమర వీరులందరికీ జోహార్లు అర్పించారు. నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అటవీ సంరక్షణ (సవరణ) చట్టం- 2023ను తీసుకువచ్చిందని, అడవుల సంరక్షణ పేరుతో అడవుల్లో ఉన్న ఆదివాసులను ఖాళీ చేయించి, లక్షల కోట్ల రూపాయల విలువచేసే అడవుల్లోని సహజ ఖనిజ సంపదలను కార్పొరేట్లకు బహుళజాతి కంపెనీలకు సామ్రాజ్యవాదులకు కట్టబెడుతున్నదన్నారు. ఆదివాసులు, ప్రజలంతా ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ సంఘటితంగా కదిలినప్పుడే ఇలాంటి చట్టాలను అడ్డుకోగలమని తమను తాము కాపాడుకోవడం సాధ్యమవుతుందని వివరించారు.

సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ దంతులూరి వర్మ మాట్లాడుతూ శ్రీకాకుళంలో కావలసినన్ని సహజ వనరులు, జీవనదులు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు వాటిని పట్టించుకోకుండా, ఈ ప్రాంతాన్ని వెనుకబడిన ప్రాంతంగానే మిగిల్చాయని, వంశధార, నాగావళి, జంఝావతి, సువర్ణముఖి వంటి జీవనదులకు ఆనకట్టలు నిర్మించి ఈ ప్రాంతాన్ని వ్యవసాయకంగా అభివృద్ధి చేయవచ్చుని, అలాగే ఉద్దానం ప్రాంతంలో ఉన్న మంచినీటి సమస్యను పరిష్కరించవచ్చుని, తద్వారా ఆ ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు అరికట్టవచ్చుని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను పెంచి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించవచ్చుని, కానీ ప్రభుత్వాలు ఆ పనిచేయడం లేదని, ఈ ప్రాంతాన్ని వెనుకబడిన ప్రాంతంగా, వలసల కేంద్రంగా ఉంచుతున్నారని దీనికి వ్యతిరేకంగా ఈ ప్రాంత ప్రజలందరూ పోరాడాలని పిలుపునిచ్చారు.

ఏపీటీఎఫ్ భానుమూర్తి గారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సరైన ఉపాధి అవకాశాలు లేక యువత వలసలు పోతున్నారని ఈ ప్రాంత యువతకు ఉపాధి కల్పించే విధంగా ఫ్యాక్టరీలను ఏర్పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం మన్యం జిల్లా నాయకులు కామ్రేడ్ పి. శ్రీను నాయుడు, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ తవిటమ్మ పాల్గొని ప్రసంగించారు. రైతు కూలీ సంఘం (ఆంధ్ర) నాయకులు కామ్రేడ్స్ పోలారావు, లక్ష్మీనారాయణ, చుట్టుపక్కల గ్రామాల నుండి రైతులు, గిరిజనులు, మహిళలు పాల్గొన్నారు.

## పార్వతీపురంలో ప్రదర్శన, ధర్నా

మహత్తర శ్రీకాకుళ గిరిజన రైతాంగ ఉద్యమ తొలి అమరులు కామ్రేడ్స్ కోరన్న, మంగన్నలకు జోహార్లు అర్పిస్తూ, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పార్వతీపురం గిరిజన భవన్ వద్ద నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు రైతు కూలీసంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తొలుత గిరిజన భవన్ వద్ద సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ పి.శ్రీను నాయుడు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో సంఘం రాష్ట్ర నాయకులు కామ్రేడ్స్ ఎస్. ఝాన్సీ, డి.వర్మ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

*****